# కోయిలా..కూ..యిలా..

## స్వేద నాదం

చెమట చుక్కనెప్పుడూ చులకన చెయ్యొద్దు
నుదుటి మీద రాతనే మార్చగలదు
నుదురుపై మొలిచిన చెమట
సేవకుడూ కర్షకుడూ శ్రామికుడూ... వీళ్లంతా
భ్రమల్లో బతకరు- శ్రమలోనే జీవిస్తారు!
స్వేదం - ఒక వేదం
కరకు రాయిని పిండి చేసి
బీడుభూమిని పండించే మనోజ్ఞ రాగం
శ్రమైక జీవన సౌందర్యానికి నిలువెత్తు సత్యం
నరనరాన బిరాబిరా పరిగెత్తే రక్తఘోష నాదం
నెత్తురు - చెమట... నాణానికి రెండు ముఖాలు
సత్తువని ఒకటి అందిస్తే
శత్రువుని రెండోది తరిమేస్తుంది
స్వేదాన్ని చిందించేవాడు
ఆశల సౌధాన్ని చేరుకుంటాడు
సౌభాగ్యాన్నందుకుంటాడు



స్వేదాన్ని బంధించాలనుకునేవాడు
అగాధంలోకి జారిపోతాడు
అనారోగ్యాన్ని తనలోనే దాచుకుంటాడు!

-తరిగొప్పుల విఎల్లెన్ మూర్తి (హైదరాబాద్)

## మనిషిగా...




పల్లవీ చరణాలతో
జీవితం కమ్మని పాటలా
అలా అలా సాగిపోతే ఎంత బాగుంటుంది
చేదు ఎదురైతే కాస్సేపలా పక్కన పెట్టి
పంచామృతాల మధురానుభూతిని
మననం చేసుకుంటే చాలదూ
చీకటికి కుమిలిపోకుండా
మనసు వాకిలిని వెలుగు పూలతో నింపితే
ఆహ్లాదపు మంచు బిందువులతో
స్నానించినట్టుండదూ
హృదయాన్ని లేత కొబ్బరిగా మలచుకుంటే
స్పందించే గుణంతో మానవత్వం
మహనీయ తత్వమయి తీరుతుంది
ముళ్లని హ్రస్వం చేసి
గులాబీలని చూడగలిగితే
బతుకు భగవంతుడిచ్చిన వరమే అనిపిస్తుంది
మళ్లీ మళ్లీ పుడమిపై మనిషిగా
జన్మించి మురిసిపోవాలనిపిస్తుంది!

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు (సికింద్రాబాద్)